క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ నిరంజన్ అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అంతకాపల్లి సబ్ స్టేషన్ గుల్లేపల్లి రూరల్ ఫీడర్ పరిధిలోని గుల్లేపల్లి,మొగలిపురం,మల్లునాయుడుపాలెం,బోదువలస,ఎల్లుప్పి, అయ్యన్నపాలెం,దుద్దువాక,కిల్లివానిపాలెం,రాపర్తివానిపాలెం,మర్రిపాలెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. ముగింపు చిత్రంగా 2021లో యు.వేణు దర్శకత్వంలో తెరకెక్కిన విరాటపర్వం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సమాంతర సినిమాలు, విదేశీ చిత్రాలు ప్రదర్శించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. త్వరలో కె.విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. మూడు రోజులు ప్రదర్శించిన చిత్రాలు తిలకించిన వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, డాక్టర్ జి.బాబ్జి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది తనిఖీలు



రైళ్లలో తనిఖీ చేస్తున్న జీఆర్పీ సీఐ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ టి.కామేశ్వరరావు, సిబ్బంది ఈ తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్, వివిధ ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

వివాహితపై దాడి

గోపాలపట్నం: వివాహితపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సింహాచలంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలివీ.. సింహాచలానికి చెందిన శంభాన దివ్య గోశాల వద్ద కార్ల లోన్లు ఇచ్చే సంస్థలో పని చేస్తోంది. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ అడ్డుపడ్డాడు. తనతో వచ్చేయాలని వేధించాడు. అతన్ని తప్పించుకుని వెళ్లేందుకు యత్నించగా ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె చేతిపై గాయమైంది. మూడు నెలలుగా ఇదే విధంగా చంద్రశేఖర్ వేధిస్తున్నాడని గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కట్టవానిపాలెంలో సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వెంకటపతిపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో మూడో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం వెంకటపతిపాలెం, కోరంగివానిపాలెం, మంగప్పయ్యగారి ఊరు, గొల్లపేట, మొల్లివారిదొడ్డి, దండినాయుడుగారిదొడ్డి, కొండవానిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వెంకటపతిపాలెంలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనం స్థానంలో నూతన భవనానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ రోడ్లు అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మళ్లీ ఎన్నికల సమయంలోఅదే రీతిలో హామీలివ్వడానికి టీడీపీ నాయకులు వస్తారని వారి అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు చల్లా కనకారావు, చింతకాయల ముత్యాలు, బొద్దపు చిన్నారావు, చంద్రారావు, అరిజిల్లి రవి, పెదిశెట్టి శేఖర్, పైల అప్పలనాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, ఎంఈవో సునీత, ఏఈలు షణ్ముఖ, రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులకు శంకుస్థాపన

భర్నికం శివారు కట్టవానిపాలెం గ్రామంలో రూ.7.50లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ డ్రైన్ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీ సీతారామాలయ 20వ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాగణంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండవగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, కార్యదర్శి ఏవీ చలపతిరావు, రామారావు, నాయుడు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేశ సంస్కృతిని చాటి చెప్పడం గర్వకారణం



కళాకారులను అభినందిస్తున్న శ్రీనివాసాచార్యులు, ఏఈవో నరసింహరాజు తదితరులు

సింహాచలం: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ఇతర దేశాల్లో చాటి చెప్పడం గర్వించదగ్గ విషయమని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కొనియాడారు. దేశ, అంతర్జాతీయ స్థాయిలో కళా ప్రదర్శనలు ఇస్తున్న విశాఖకు చెందిన స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన బాల కళాకారులను బుధవారం సింహగిరిపై ఆయన అభినందించారు. ఇటీవల ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొన్న సంఘవి, చందన లక్ష్మి, పూజిత, స్నేహితలను సత్కరించారు. అలాగే న్యూఢిల్లీలో గణతంత్ర దినోత్సవవేడుకల్లో ప్రదర్శన ఇచ్చిన నేహా అక్షయ బృందం కోఆర్డినేటర్ కల్పనా సంఘవితో పాటు కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్ అభినందించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఏఈవో నరసింహరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు పాల్గొన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు



ఎమ్మెల్యే ప్రారంభించనున్న పరవాడ భవిత కేంద్ర భవనం

పరవాడ: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మండలంలో నాయుడుపాలెం, పరవాడ గ్రామాల్లో రూ.72.08 లక్షల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. రాముడుగారి గ్రామంలో రూ.7లక్షలతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఇంటింటి కుళాయి పథకం, సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.11 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాలను ప్రారంభిస్తారు. అలాగే ముత్యాలమ్మపాలెంలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.13.80 లక్షలతో జెడ్పీ పాఠశాలలో నిర్మించిన డైనింగ్ హాల్‌ను , సిమ్మన్నగారి దొడ్డిలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును వినియోగంలోని తెస్తారు. కోరంగివానిపాలెంలో రూ.12 లక్షలతో నిర్మించిన ఇంటింటి కుళాయిలు, రూ.11లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత పరవాడలో రూ.15 లక్షలతో నిర్మించిన భవిత కేంద్రాన్ని ఉదయం 11.15 గంటలకు ప్రారంభిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు రామారావు చెప్పారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



బీసీ గేటు వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం ఉదయం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ఎన్‌జేసీఎస్‌లో జరిగిన నూతన వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2017 జనవరి 1 నుంచి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణా రెడ్డి, దాలినాయుడు, ఎన్నేటి రమణ, సంపంగి ఈశ్వరరావు, గొందేశి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా మిషన్ అంత్యోదయ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

ఎంపీడీవో రమేష్‌నాయుడు

సబ్బవరం: మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని మండలంలోని పలు శాఖల అధికారులకు ఎంపీడీవో రమేష్ నాయుడు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో దీనిపై బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంక్షేమ అధికారులు, గణాంక సహాయకులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 26 శాఖలకు సంబంధించి 216 ప్రశ్నలకు సమాధానాలను మూడు రోజుల్లో పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.దీనికి సంబంధించిన యాప్ గురువారం ఓపెన్ అవుతుందని, వెంటనే సేకరించిన ఆయా సమాధానాలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. యాప్‌లో అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏవో ఎస్. బాబూరావు,ఈవోఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పరిశుభ్రతకు కృషి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అందరూ సమష్టిగా పరిశుభ్రతకు కృషి చేయాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు కోరారు. బుధవారం నరవలోని జామియా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్, ఇంక్లూజివ్ పాలసీ విభాగం నిర్వహించిన 'ఎండింగ్ ఓపెన్ డెఫికేషన్ టువర్డ్స్ ప్రమోటింగ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్'సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా వర్సిటీ పరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేంద్రనాయుడు మాట్లాడుతూ సంప్రదాయ అడ్డుగోడలు తొలగించి పరిశుభ్రత, ఆరోగ్య భద్రత దిశగా అడుగేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.వరప్రసాద్, శానిటేషన్ సెక్రటరీ డాక్టర్ జి.జగన్నాథరావు, జామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కరస్పాండెంట్ షేక్ రహమాన్, డాక్టర్ జి.శాంతారావు, చుక్క క్రిష్టోఫర్, జోసఫ్ రాజు, టి.బుజ్జి పాల్గొన్నారు.

పురాణేతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: పురాణ ఇతిహాసాలు మానవాళి జీవనానికి మార్గదర్శకాలని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మతో కలిసి ఆయన బుధవారం శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు కొద్ది రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ సనాతన పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తుల్లో విశేషమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. ఈ విజ్ఞానం మానవ మనుగడ, జీవన విధానానికి మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. సనాతన ధర్మాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు షణ్ముఖశర్మ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం షణ్ముఖశర్మ ప్రవచనాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి, నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. 108 మంది దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేశారు.

ఉక్కు పోరాటం భావి తరాలకు మార్గదర్శకం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులు చేస్తున్న ఉక్కు పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 727వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు యు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, వి.రామ్మోహన కుమార్, సీహెచ్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



రోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు.

ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని విజయ్‌కుమార్ సిన్హా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే సంస్థ లక్ష్యమని చెప్పారు. అలాగే మహిళల కోసం సంస్థ ఏర్పాటు చేసిన టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులను వినియోగించుకోవాలని దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా సూచించారు. సింహాద్రి ఆధ్వర్యంలో విజయవాడలో 6 నెలల పాటు నైపుణ్యాభివృద్ధి కోర్సులు ఏర్పాటు చేస్తున్నామని ఏజీఎం హెచ్‌ఆర్ రుమాడీశర్మ చెప్పారు. బోర్డింగ్, లాడ్జింగ్ సదుపాయాలకు కల్పించి స్టైఫండ్ కూడ అందజేస్తామని చెప్పారు. కంటి వైద్య శిబిరానికి 482 మంది హాజరు అయ్యారు. వారిలో 315 మందికి కంటి పరీక్షలు జరిపి కళ్లద్దాలు అందజేశారు. 35 మందిని కంటి శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి పంపించామని సీఎంవో డాక్టర్ ఏకే దాస్ మహాపాత్ర చెప్పారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, సీఎస్సార్ సీనియర్ మేనేజర్ వి.ప్రకాశరావు పాల్గొన్నారు.

పెన్షనర్స్ హెల్త్ గైడ్ ఆవిష్కరణ



పెన్షనర్స్ హెల్త్‌గైడ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పెన్షనర్స్ అసోసియేషన్ తీర్చిదిద్దిన హెల్త్ గైడ్ హ్యాండ్ బుక్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి వర్సిటీ సెనేట్ మందిరంలో బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయిలో పెన్షనర్లకు ఉపయుక్తంగా నిలిచే అంశాలు, హెల్త్ కార్డులతో పొందే సేవలు, ఉద్యోగులకు, పెన్షనర్లకు సులభంగా సమాచారాన్ని అందించేలా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. ఆస్పత్రులు అందించే సేవలు, సమగ్ర వివరాలు, ఫోన్ నంబర్లు వంటివి ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు గొలగాని అప్పారావు, గౌరవ అధ్యక్షుడు టి.సైదయ్య, జనరల్ సెక్రటరీ సి.నాగేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు



పాల్గొన్న విద్యార్థులు



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

- పాస్ అవుట్ విద్యార్థులు ఉద్యోగాల్లో చేరండి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, నూతన ఆవిష్కరణలు రూపొందించి పేటెంటు హక్కు పొందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యుబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి కాలేజీ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.